మదర్ చైల్డ్ ఫీడింగ్ కేంద్రం ప్రారంభం


సనత్‌నగర్ బస్టాండ్‌లో మదర్ చైల్డ్ ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన దృశ్యం

సనత్‌నగర్: వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ ఆధ్వర్యంలో సనత్‌నగర్ బస్టాండ్‌లో శుక్రవారం మదర్ చైల్డ్ ఫీడింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ డిస్ట్రిక్ట్ 102–ఏ గవర్నర్ భాస్కర్‌గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే తల్లులు తమ పిల్లలకు ఫీడింగ్ ఇచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే క్లబ్ తరుపున ఫీడింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఈ తరహా కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, టీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఖుస్రో షా ఖాన్, వాసవీ క్లబ్ హైదరాబాద్ గ్రేటర్ అధ్యక్షులు జయప్రకాష్ రామ్, కార్యదర్శి దయాకర్‌గుప్తా, కోశాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తు గడువు పొడిగించాలి

అడ్డగుట్ట: ప్రజల వద్దకు పాలనతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన దరఖాస్తు గడువు నెల రోజులు పొడిగించాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచడంతో పాటు ప్రజా పాలన కేంద్రాల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసి దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల తరువాత ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. కాని, దరఖాస్తు గడువు కొద్ది రోజులే ఉండడంతో ప్రజలంతా ఆందోళన చెందుతూ భారీ సంఖ్యలో సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారన్నారు. దీంతో దరఖాస్తుపై సరైన అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే అదునుగా కొందరు ఫామ్ నింపేందుకు రూ. 10 తీసుకుంటున్నారన్నారు. అందువల్ల అధికారులు వెంటనే హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి అవగాహన లేని దరఖాస్తుదారులకు సహాయం చేయాలని కోరుతున్నామన్నారు.

క్రిస్మస్ కానుకల పంపిణీ


హోలీఫ్యామిలి చర్చిలో క్రిస్మస్ కానుకలను పంపిణీ జేస్తున్న వెన్నెల

రసూల్‌పురా: పేద కుటుంబాలకు క్రిస్మస్ సందర్భంగా తిరుమలగిరి హోలీ ఫ్యామిలి చర్చిలో శుక్రవారం గిఫ్ట్‌ప్యాక్‌ల పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ జీవీ వెన్నెల ముఖ్య అతిథిగా హాజరై క్రిస్టియన్ పేద కుటుంబాల మహిళలకు క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మా ప్రభుత్వం గత ప్రభుత్వం మాదిరిగా క్రిస్మస్ సందర్భంగా నిరుపేదలకు బట్టలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో చర్చిల వారీగా ఈ కానుకల పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ మార్రెడ్డి, పార్టీ నాయకులు బల్వంత్ రెడ్డి, శాంసన్ సూర్యకాంత్, ఎల్‌జీ. ఆంథోని జోసేఫ్, వినీత తదితరులు పాల్గొన్నారు.

స్టాటిటిక్ ట్యాంక్‌ను మార్చాలి


పాడైన ట్యాంక్‌ను చూపిస్తున్న కాలనీ వాసులు

లాలాపేట: తార్నాక డివిజన్ ఇందిరానగర్‌లో పగిలిపోయిన స్టాటిటిక్ ట్యాంక్‌ను తొలగించి నూతన ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలనీ కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ఆ ప్రాంతంలో పాడైన పవర్ బోర్‌ను మరమతు చేయాలనీ పలు మార్లు విజ్ఞప్తి చేయగా ఇటీవలే స్పందించిన అధికారులు పవర్ బోరుకు నూతన మోటార్‌ను బిగించారని శుక్రవారం స్థానికులు తెలిపారు. కానీ పాడైన స్టాటిటిక్ ట్యాంక్‌ను మార్చకపోడంతో ట్యాంక్‌లో నిండిన నీళ్ల రోడ్డుపాలైతున్నాయని పేర్కొన్నారు. దీంతో స్థానికులకు వాడుక నీటి సమస్య తలెత్తుందన్నారు. కావునా సంబంధిత అధికారులు వెంటనే నూతన ట్యాంక్‌ను ఏర్పాటు చేయాలనీ ఇందిరానగర్ వాసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నేతికార్ మహేశ్, మహిళలు వనజ తదితరులున్నారు.

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం వినాయకస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఉ.6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం జరుగుతాయని ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

బుర్రా వెంకటేశం సమర్థవంత అధికారి



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శిగా నియమితులైన బుర్రా వెంకటేశం సమర్థవంతమైన ఐఏఎస్ అధికారి అని టీపీసీసీ అధికార ప్రతినిధి, ఓయూ పరిశోధన విద్యార్థి చనగాని దయాకర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం బూర వెంకటేశంను తన ఛాంబర్ కలసి అభినందనలు తెలిపినట్లు చెప్పారు. పేద విద్యార్థులను సైతం ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిదెందుకు యూపీఎస్సీ రాత పరీక్షకు ఉచిత శిక్షణకు ఓయూలో ఏర్పాటు చేసిన సివిల్ సర్వీసెస్ అకాడమి ఏర్పాటుకు బూర వెంకటేశం ఎంతో సహకరించారని పేర్కొన్నారు.

న్యాయ వ్యవస్థలో బడుగు, బలహీనవర్గాలకు స్థానం కల్పించాలి

పంజగుట్ట: న్యాయ వ్యవస్థలో బడుగు, బలహీన వర్గాలకు కూడా స్థానం కల్పించాలని ఫోరం ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అడ్వకేట్స్ ఆఫ్ తెలంగాణ కన్వీనర్, రిటైర్డ్ జడ్జి, తెలంగాణ జడ్జిల అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మ నారాయణ కోరారు. న్యాయాన్ని, ధర్మాన్ని కాపాడాల్సిన న్యాయవ్యవస్థలో అధికశాతం ఉన్న వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, న్యాయవాది భీమరావు మాట్లాడుతూ... న్యాయవ్యవస్థ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్నత న్యాయస్థానంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 నుంచి 10 శాతం మాత్రమే స్థానం కల్పిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఫోరం కో ఆర్డినేటర్‌లు బైరి రాకేష్ కుమార్, దున్న అంబేద్కర్, ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణ, మేకల కమలాకర్, అన్నపూర్ణ, సుమిత్ర, సల్మా పాల్గొన్నారు.

వాళ్లు కడతారు..వీళ్లు కూలుస్తారు..

- 2015 నుంచి ఇదే తంతు
- బేగంపేట మాతాజీనగర్‌లో మళ్ళీ నిర్మాణాలు
- గ్రీన్‌జోన్‌గా ప్రకటించినా ఆగని ఆక్రమణలు
- ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్న అధికారులు


మాతాజీనగర్‌లో గతంలో అక్రమ నిర్మాణాలను కూల్చుతున్న దృశ్యం - ప్రస్తుత నిర్మాణం (ఇన్‌సెట్)

సనత్‌నగర్: వాళ్లు నిర్మిస్తారు..వీళ్లు కూలుస్తారు.. గత కొన్నేళ్లుగా అక్కడ ఈ తంతు షరామామూలైంది. ఆ..ఏముంది.. కూల్చుతారు..మళ్ళీ కట్టేస్తే పోలా..అన్న ధోరణి ఆక్రమణదారుల్లో పెరిగిపోయింది. అక్రమ నిర్మాణాల పరంపర వెనుక అధికార గణం సపోర్ట్ కూడా ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. లేకుంటే అంతగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ పదే పదే కూల్చివేతలు చేసిన అధికారులే ఇప్పుడు అక్కడ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ పరిస్థితి బేగంపేట మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న బాలానగర్ మండలం సర్వేనెంబర్ 194/8/1లో నెలకొంది.

- ఈ సర్వేనెంబర్‌లో దాదాపు 10 ఎకరాల 20 గుంటల ప్రభుత్వం స్థలం ఉంది. 2015లో ఈ స్థలంలో ఓ బడా కంపెనీ నిర్మాణాలు చేపడితే అక్రమ లేఅవుట్‌గా పేర్కొంటూ అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి హయాంలో అధికారులు కూల్చివేశారు. ఆ తర్వాత మళ్ళీ 2017లో తిరిగి నిర్మాణాలు చేపట్టగా అప్పటి బేగంపేట డీఎంసీ శ్రీనివాస్ నేతృత్వంలో కూల్చివేతలు చేపట్టారు. అయినప్పటికీ ఆక్రమణదారులు పట్టువదలని విక్రమార్కుల్లా 2019, 2021లలో నిర్మాణాలు చేపట్టిన ప్రతిసారీ అధికారులు కూల్చివేస్తూ వస్తున్నారు. వాస్తవానికి నాలాలు, చెరువుల చుట్టూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ ఆ ప్రాంతాన్ని గ్రీన్‌జోన్‌గా అధికారులు ప్రకటించారు. అవేమీ లెక్కచేయకుండా ఆక్రమణదారులు నిర్మాణాలకు తెగపడుతూనే ఉన్నారు.
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గత రెండు నెలలుగా ఏర్పాట్లలో అధికారులు తలమునకలై ఉండడం..అదే అదునుగా ఆక్రమణదారులు మరోసారి అక్రమ నిర్మాణాలకు తెగపడ్డారు. దీనికి టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఓ కిందిస్థాయి అధికారి సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ లేఅవుట్‌గా నిర్ధారించి ఒక్కసారి అధికారులు కూల్చిన స్థలంలోనే మళ్ళీ నిర్మాణాలు వెలిసిన నేపథ్యంలో అధికారి ఏకంగా ఇంటి నెంబర్లు కూడా జారీ చేయిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. దీనిపై ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్, విజిలెన్స్, పోలీసు అధికారులకు కూడా పలువురు ఫిర్యాదు చేశారు. ఇక్కడి వ్యవహారంలో కోర్టు ఆదేశాలతో బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆక్రమణదారులపై కేసులు కూడా నమోదయ్యాయి. ఓ బడా సంస్థ ప్లాట్లుగా చేసి అమాయకులకు విక్రయించిన ఈ మొత్తం వ్యవహారంలో అధికారులకు, ఆ బడా సంస్థకు మధ్య ఆ అమాయకులే సమిధలుగా మారుతున్నారనేది నగ్న సత్యం.

చర్యలు తీసుకుంటాం: బేగంపేట టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్

గతంలో ఇక్కడి అక్రమ లేఅవుట్‌లో నిర్మాణాలు చేపడితే కూల్చివేసిన మాట వాస్తవమే. మళ్ళీ నిర్మాణాలు చేపడితే మాత్రం పరిశీలించి చర్యలు తీసుకుంటాం. అక్రమ అలేవుట్‌ల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు.

కేజీబీవీ సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ నాలుగు సంవత్సాల నుంచి పిల్లలకు బెడ్ షీట్స్, కార్పెట్స్, ట్రంక్ బాక్స్, ప్లేట్స్, గ్లాసులు ఇవ్వడం లేదన్నారు. చాలా కాలంగా పాత వాటిని వాడడం వద్ద విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యార్థినులకు అందాల్సిన హైజినిక్ కిట్ కూడా అందడం లేదన్నారు. అంతే కాకుండా 2019 నుంచి నెలకు అందవలసిన కాస్మాటిక్ బిల్ రూ. 100 కూడా ఇవ్వడంలేదని, ప్రస్తుతం ఉన్నటువంటి భవనాలలో తరగతి గదులు సరిపోవడం లేదని చెప్పారు. ప్రతీ హాస్టల్లో అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని కోరారు. దేశంలోనే నాణ్యమైన విద్య అందించడంలో 35వ స్థానంలో ఉన్న తెలంగాణ విద్యా వ్యవస్థను పటిష్టపరిచి నాణ్యమైన విద్యను అందించే గ్యారెంటీని ప్రభుత్వం చట్టబద్ధ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అదే విధంగా తెలంగాణలో తరగతికి తగ్గ విద్యాసామర్థ్యాలు అందించి పిల్లల హక్కులను కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం, ఇదే విషయమై ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. తల్లుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొత్త సాయిలక్ష్మి, పెరుగు లావణ్య, ఎస్. అనిత గౌడ్, సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ, గాదెపాక బాలయ్య తదితరులు ఉన్నారు.

ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు


బీజేఆర్ కమ్యూనిటీహాలులోని కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మార్వో పద్మ సుందరి

అడ్డగుట్ట: ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అందరి దరఖాస్తులు స్వీకరిస్తామని మారేడుపల్లి మండల తహసీల్దార్ పద్మ సుందరి తెలిపారు. శుక్రవారం ఆమె అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాలులోని కేంద్రాన్ని పర్యవేక్షించారు. ఈ సదర్భంగా ఎమ్మార్వో పద్మ సుందరి మాట్లాడుతూ దరఖాస్తుదారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా వారి ఇళ్ల వద్దకు జీహెచ్‌ఎంసీ ఆర్పీలు వచ్చి దరఖాస్తు ఫారాలు అందజేస్తున్నారని తెలిపారు. జనవరి 6వ తేదీ వరకు గడువు ఉందని, అందరి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో ఆర్‌ఐ రాధిక, జీహెచ్‌ఎంసీ ఏఈ వేణు తదితరులు ఉన్నారు.

దరఖాస్తు ఫారాలు డబ్బులకు విక్రయిస్తే చర్యలు

ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఆరు గ్యారంటీల దరఖాస్తు ఫారాలను కొందరు డబ్బులకు విక్రయిస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో హెచ్చరించారు. స్టేషనరీలు, మీసేవా కేంద్రాలు, జిరాక్స్ సెంటర్ల నిర్వాహకులు రూ. 20, 40 చొప్పున ఫామ్‌ల విక్రయాలకు పాల్పడున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. విక్రయాలను మానుకోకుంటే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

సీతాఫల్‌మండికి అయోధ్య శ్రీరాముని అక్షింతలు


అయోధ్య నుంచి అక్షింతలు తీసుకువచ్చిన కరసేవకులు

చిలకలగూడ : అయోధ్య శ్రీరామజన్మభూమి పుణ్య క్షేత్రంలో బాలరామున్ని పూజించిన అక్షింతలు శుక్రవారం సీతాఫల్‌మండికి చేరుకున్నాయి. నగర బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్ భాస్కర్ గిరి ఆధ్వర్యంలో అక్షింతలు తీసుకువచ్చిన కరసేవకులకు స్వాగతం పలికారు. అయోధ్య రామాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ అవుతుంటే అందరి ఇళ్లలో అక్షింతలతో రామున్ని పూజించాలని ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టామని భాస్కర్‌గిరి తెలిపారు. అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను జనవరి 1 వ తేది నుంచి ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. ఎందరో కరసేవకుల త్యాగఫలితమే అయోధ్యలో రామమందిర నిర్మాణానికి పునాది అన్నారు. కార్యక్రమంలో బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు యుధవీర్, సురేందర్, అనీల్, సందీప్, యశ్వంత్‌లు పాల్గొన్నారు.

రెండో రోజు ప్రజా పాలనకు విశేష స్పందన


ప్రజాపాలన కార్యక్రమం వద్ద మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

లాలాపేట: ఇందిరమ్మ అభయ హస్తం పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని నియోజక వర్గం కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం రెండవ రోజు మాణికేశ్వర్‌నగర్‌లో జరిగిన ప్రజా పాలన కార్యక్రమాన్ని నేతలు పరిశీలించారు.అక్కడికి వచ్చిన ప్రజలకు మార్గనిర్దేశం చేశారు. అధికారులు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అర్హులందరికి అందించేందుకు కృషి చేస్తామన్నారు. జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రజా పాలనలో అర్హులైన ప్రజలందరూ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకోవాలనీ సూచించారు. కార్యక్రమంలో మాజీ వార్డుమెంబర్ లాజరస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వరికుప్పల రవి, వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య తదితరులున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: కిలో రూపాయల్లో... టమాటా 21, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 70, పచ్చాకకర 60, పందిరి బీర 45, క్యాబేజీ 16, క్యారెట్ 35, దొండ 50, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 27, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 19, చామగడ్డ 45, మొరంగడ్డ 23, కందగడ్డ 45, సొరకాయ 15, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

10319 ప్రజాపాలన దరఖాస్తులు

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 20 సెంటర్లలో శుక్రవారం 10319 ప్రజాపాలన, 2521 ఇతర దరఖాస్తులు స్వీకరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 15757 ప్రజాపాలన, ఇతర దరఖాస్తులు 3763 అందాయన్నారు.

12 శాతం రిజర్వేన్లను అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ముస్లిం మైనార్టీ ఓయూ మలిదశ ఉద్యమకారిణి డా.రేష్మ హుస్సేన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించు ఒక్క రోజు ఇఫ్తార్ విందులు వద్దు 12 శాతం రిజర్వేషన్లు ముద్దు అని నినాదాలు చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సీఎం రేవంత్‌రెడ్డి 12 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు.

విద్యారంగ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వండి: ఎమ్మార్పీఎస్

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యారంగపదవుల్లో మాదిగలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్‌నరేష్ మాదిగ కోరారు. శుక్రవారం ఓయూలో ఆయన మాట్లాడుతూ మాదిగల పట్ల మాజీ సీఎం కేసీఆర్ చేసిన తప్పిదాలను, వివక్షతను చూపకూడదని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. టీఎస్‌పీఎస్సీ మొదలు ఉన్నత విద్య మండలి చైర్మన్, వైస్ చైర్మన్లు, వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్ తదితర విద్యరంగ ఉన్నత పదవుల్లో మాదిగలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎమ్మార్పిఎస్ అధినేత మందకృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పిఎస్, ఎంఎస్ఎఫ్ ప్రతిపాదించిన డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించి అమలు చేయాలని మాదిగ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ పేర్కొన్నారు. శివకుమార్ మాదిగ, పరుశరామ్, శ్యామ్‌సన్‌మాదిగ, మహేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలనపై అవగాహన కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రకటించిన ప్రజా పాలన, ఆరు గ్యారంటీ పతకాల దరఖాస్తుల పై అవగాహన కల్పించాలని టీపీసీసీ మాజీ జాయింట్ సెక్రెటరీ, ఓయూ విద్యార్థి నేత ఏగూరి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు, విద్యావంతులకు, కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీల నేతలు దరఖాస్తు చేయడంలో కలిగే సందేహాలను నివృత్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అనేక మందికి దరఖాస్తుల పై అవగాహన లేక అనేక సందేహాలతో ఆందోళ చెందుతున్నారని తెలిసిన వారు తెలియని వారికి వివరించి చెప్పాలన్నారు.


మూసివేసిన సీతాఫల్‌మండి మీసేవ కేంద్రం నుంచి నిరాశతో వెనుదిరుగుతున్న దృశ్యం

అయోమయం..గందరగోళం

- 'ప్రజాపాలన'పై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- దరఖాస్తు ప్రింటవుట్ రూ. 50


బీదలబస్తీ సెంటర్‌లో లోపలనుంచి తాళం వేసుకున్న దృశ్యం

చిలకలగూడ : మీ సెంటర్ ఇక్కడ కాదు అక్కడ... ఈ రోజు మీ ప్రాంతం నుంచి దరఖాస్తులు స్వీకరించడంలేదు.. తర్వాత తీసుకుంటాం.. దరఖాస్తుఫారాలు అందుబాటులో లేవు... ఇవీ ప్రజాపాలన కేంద్రాల వద్ద వినిపించిన మాటలు.. ఉరుకులు, పరుగులు, ఆయోమయం, గందరగోళం అక్కడ కనిపించిన దృశ్యాలు.. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కేంద్రాల వద్ద రెండో రోజైన శుక్రవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలో నిన్నటి సీన్ రిపీట్ అయింది. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో 20 ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేలాది మంది ఒకేసారి రాకుండా ప్రాంతాల వారీగా జాబితా రూపొందించారు. ఏ ప్రాంతం వారికి ఏ సెంటర్ కేటాయించారు ఏ రోజు దరఖాస్తు సమర్పించాలి అనే అంశాలపై సమాచారం లేకపోవడంతో అన్ని ప్రాంతాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దరఖాస్తుఫారాలు అందుబాటులో లేక జిరాక్స్ సెంటర్లను ఆశ్రయించగా, ఒక్కో దరఖాస్తుఫారంకు రూ. 30 నుంచి 50 వరకు వసూలు చేశారు. ఆయా సెంటర్ల వద్ద రద్దీ ఎక్కువ కావడంతో లోపలనుంచి తాళాలు వేసుకునే పరిస్థితి నెలకొంది. ఆయా సెంటర్ల వద్ద తోపులాటలు, వాగ్వాదాలు సర్వసాధారణంగా మారాయి. తక్షణమే సంబంధిత ఉన్నతాధికారుల స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

రంగంలోకి దళారీలు...

నిర్వహణలోపంతో కొన్ని సెంటర్ల పరిధిలో దళారీలు రంగంలోకి దిగారు. దరఖాస్తుకో రేటు, సెంటర్‌లో సబ్‌మిట్‌కు మరో రేటు, తెల్లరేషన్ కార్డు ఇప్పిస్తామంటు అందినకాడికి దోచుకుంటున్నారు. రూ. 10 వేలు ఇస్తే రెండువారాల్లో తెల్లరేషన్‌కార్డు ఇప్పిస్తానని ఓ వ్యక్తి తనను సంప్రదించాడని నామాలగుండుకు చెందిన ఓ మహిళ తెలిపింది. దళారీల మాటలు నమ్మవద్దని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నారు. అటువంటివారిపై పోలీసులకు లేదా తమకు సమాచారం అందించాలని కోరుతున్నారు.


ఉప్పరిబస్తీ కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ హేమ

మీసేవ కేంద్రం మూసివేత...

సీతాఫల్‌మండి మీసేవ సెంటర్‌ను గత రెండు రోజులుగా మూసివేశారు. ఆధార్ అప్‌డేట్, రేషన్‌కార్డులు, ప్రజాపాలన దరఖాస్తుల కోసం వందలాది మంది మీసేవ కేంద్రానికి చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. దీంతో రెగ్యులర్ సర్వీసులు అందించలేకపోతున్నామని మీసేవ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాపాలన సెంటర్లను సందర్శించిన అధికారులు...

నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సెంటర్లను ప్రజాపాలన స్పెషల్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వై వేణుమాధవ్, డీపీఓ శ్రీనాథ్, ఏఈఈ రాధిక తదితరులు శుక్రవారం సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. దరఖాస్తుల స్వీకరణ మరింత సజావుగా సాగేందుకు పలు సలహాలు, సూచనలు అందించారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ డివిజన్‌లోని నాలుగు సెంటర్లను సందర్శించి ఆరుగ్యారెంటీల దరఖాస్తులు స్వీకరించారు.

దరఖాస్తులు ఉచితంగా అందజేస్తున్నాము


దరఖాస్తు కేంద్రాన్ని సందర్శించిన డీసీ సుదాంశ్

బౌద్ధనగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల కోసం దరఖాస్తు ఫారాలు అన్ని కేంద్రాల వద్ద ఉచితంగా అందజేస్తున్నామని జీహెచ్‌ఎంసీ డీసీ సుదాంశ్ తెలిపారు. శుక్రవారం ఆయన బౌద్ధనగర్‌లోని ప్రజా పాలన దరఖాస్తు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా డీసీ సుదాంశ్ మాట్లాడుతూ దరఖాస్తుదారులెవ్వరూ ఫామ్‌లను డబ్బులు పెట్టి కొనుగోలు చేయవదన్నారు. ఆయా కేంద్రాల వద్దనే ఉచితంగా దరఖాస్తు ఫారాలు అందజేస్తున్నామన్నారు. కొంత మంది జిరాక్స్ షాపు, మీ సేవా కేంద్రాల్లో డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారన్నారు. ఆ విధంగా డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వమే ఉచితంగా దరఖాస్తు ఫారాలు అందిస్తుందని చెప్పారు. ఈ పరిశీలనలో వారాసిగూడ సీఐ శంకర్‌తో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

రాగ్యానాయక్‌కు విద్యార్థుల నివాళి



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మాజీ ఎమ్మెల్యే, దిగవంత ధీరావత్ రాగ్యానాయక్‌కు విద్యార్థి నేతలు, ప్రొఫెసర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుక్రవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట గిరిజన విద్యార్థి శక్తి రాష్ట్ర అధ్యక్షులు శరత్ నాయక్ ఆధ్వర్యంలో రాగ్యానాయక్ 22వ వర్ధంతిని జరుపుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థి నేతలు రాగ్యానాయక్ చిత్రపటానికి నివాళ్లు అర్పించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు.